క్లుప్తంగా

సత్తుపల్లి ఏఎంవీఐగా దినేష్


ఏఎంవీఐ దినేష్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రవాణా శాఖా కార్యాలయంలో ఏఎంవీఐగా జి.దినేష్ గురువారం విధుల్లో చేరారు. ఈయన ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి శిక్షణ పూర్తి చేసుకొని ట్రెయినీ ఏఎంవీఐగా నియమితులయ్యారు. బయ్యారం గ్రామానికి చెందిన దినేష్ బీటెక్ పూర్తి చేసి స్టీల్ అథారటీ ఆఫ్ ఇండియాలో కొంతకాలం ఉద్యోగం చేశారు.

నియామకం..


రత్నతారక రాజన్న

కల్లూరురూరల్: ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కటుకూరి రత్నతారక రాజన్న నియమితులైనారు. ఈ మేరకు హ్యూమన్ రైట్స్ జాతీయ కార్యవర్గం నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన కటుకూరి రత్నతారక రాజన్న చాలా కాలం నుంచి సాంఘీక సేవా కార్యక్రమాలతో పాటు మానవ హక్కుల రక్షణకు కృషి చేస్తున్నారు. ఆయన కృషికి గుర్తింపుగా ఈ పదవికి ఎంపిక చేశారు. తనకు జాతీయ స్థాయిలో పదవి ఇచ్చిన కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా..


రామ్ నరసింహారావు

కల్లూరు: మున్నూరు కాపు ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది పెద్దబోయిన రామ్ నరసింహారావు ఎంపికయ్యారు. ఈ మేరకు మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్‌లు గురువారం రాత్రి ఉత్తర్వులు అందించారు.

సీపీఎం జిల్లా కమిటీలో స్థానం


కొండెబోయిన నాగేశ్వరరావు

కారేపల్లి: సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ నూతన కార్యవర్గంలో కారేపల్లి మండలానికి చెందిన కొండెబోయిన నాగేశ్వరరావు మూడోసారి ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో జరిగిన 22వ జిల్లా మహాసభలో జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో నాగేశ్వరరావుకు చోటు దక్కింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా వీరయ్య..

ఎర్రుపాలెం: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా భీమవరం గ్రామానికి చెందిన దివ్వెల వీరయ్య రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో జరిగిన పార్టీ 22వ జిల్లా మహాసభల్లో ఈ ఎన్నిక జరిగినట్లు పార్టీ మండల కమిటీ కార్యదర్శి మద్దాల ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్లూరు ఎస్సైగా హరిత


ఎస్సై హరిత

కల్లూరు: కల్లూరు ఎస్సైగా దిద్దుకూరి హరిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన షాకీర్ బదిలీపై వెళ్లడంతో వరంగల్ నుంచి హరిత బదిలీపై కల్లూరు వచ్చారు. ఈ సందర్భంగా హరితకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సోని

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సోని అన్నారు. మహిళ శిశుసంక్షేమ ఆధ్వర్యాన గురువారం పట్టణంలోని విశ్వశాంతి పాఠశాల, టాలెంట్ స్కూల్, మిరాకిల్ మైండ్స్ పాఠశాలల్లో చిన్నారులకు అవగాహన కల్పించారు. ఎదుటివారి దుర్బుద్ధిని గ్రహించే విషయంపై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనిత, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను జగన్నాధపురం గ్రామ సమీపంలో గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

పూర్తయ్యేదెన్నడో..?


మత్కేపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న జీపీ నూతన భవనం

- అసంపూర్తిగా జీపీ నూతన భవన నిర్మాణాలు
- అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

చింతకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలోని పలు గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మాణాలను చేపట్టిన గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయోనని తెలియటం లేదు. గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలకు నిధుల సరిపడక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ నూతన

ఏళ్ల తరబడి పనులు..

మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీలకు భవనాలు సక్రమంగా లేకపోవటంతో గ్రామ పంచాయతీలకు నూతన భవన నిర్మాణాలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఒక్కో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు చేశారు. మంజూరైన నిధులతో ఎనిమిదిన్నరేళ్ల క్రితం భవన నిర్మాణాలను చేపట్టిన కాంట్రాక్టర్లు నిధులు సరిపడక నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారు.

అసంపూర్తిగా నిలిచిన పనులు..

చింతకాని మండలం మత్కేపల్లి గ్రామంలో స్లాబ్ వరకు మాత్రమే నిర్మించారు. మత్కేపల్లిలో అసంపూర్తిగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ భవనం పశువులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా మండలంలో నూతనంగా ఏర్పాటైన తిరుమలాపురం, రాఘవాపురం, గాంధీనగర్‌కాలనీ, నాగులవంచ రేల్వేకాలనీ, రేపల్లెవాడ, నర్సింహాపురం గ్రామ పంచాయతీల్లో.. తిరుమలాపురం, గాంధీనగర్‌కాలనీ, రేపల్లెవాడ, నర్సింహాపురం ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. వీటిలో తిరుమలాపురం, గాంధీనగర్‌కాలనీ జీపీ భవనాలు పూర్తి కాగా.. సొంత భవనాలు లేని జీపీలు ప్రస్తుతం అద్దె భవనాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. కావున అసంపూర్తి భవనాలకు, కొత్త జీపీలకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సిబ్బంది

పనులు పూర్తి చేస్తాం..



గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలకు ఈజీఎస్ నుంచి మంజూరైన నిధులతో పనులను చేపట్టడం జరిగింది. మిగిలిపోయిన గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలంటే ఒక్కో పంచాయతీ భవనానికి రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు నిధులు అవసరమవుతాయి. అసంపూర్తిగా జీపీ నిర్మాణ పనులకు పంచాయతీ నిధులను వెచ్చించి పనులు పూర్తి చేస్తాం.

– సీహెచ్.రాంబాబు, మండల ఇన్‌చార్జ్ ఏఈ, చింతకాని

ఇబ్బందిగా ఉంది..



గ్రామ పంచాయతీలకు నూతనంగా నిర్మిస్తున్న భవనాలు పూర్తి కాకపోవటంతో అద్దె భవనాల్లో కార్యక్రమాలను సాగిస్తున్నారు. సమావేశాలు నిర్వహించాలంటే అసౌకర్యంగా ఉంటుంది. గ్రామ పంచాయతీ కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతి కొండలరావు, మాజీ సర్పంచ్, మత్కేపల్లి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


బోనకల్: ఫరీదాకు గోల్డ్‌మెడల్ అందిస్తున్న అధికారులు


కొణిజర్ల: గోల్డ్ మెడల్ తీసుకుంటున్న చరణ్ గౌడ్

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన విద్యార్థిని షేక్ ఫరీదా రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఈమె అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. విద్యార్థినిని హెచ్ఎం కె.భాగ్యలక్ష్మి, పీడీ నవీద్ పాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

● తల్లాడ: మండలంలోని రంగంబంజర గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజనులు సీఎం కప్ క్రీడల్లో తమ ప్రతిభను కనబర్చి స్టేట్‌కు ఎంపికయ్యారు. ధర్మసోత్ సింధూప్రియ, అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. ధర్మసోత్ అనీల్‌కుమార్ నాయక్ అథ్లెటిక్స్‌లో ట్రి అక్ లాన్ సీలో ద్వితీయ స్థానం సాధించాడు. ధర్మసోత్ రామ్ చరణ్ జూడో గేమ్స్‌లో ప్రథమ స్థానం సాధించాడు.

ఈ నెల 27న హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు విద్యార్థులు ఎంపిక కావడంతో వారిని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్, గ్రామ పెద్దలు అభినందించారు.

● కొణిజర్ల: మండలంలోని పెద్ద మునగాలకు చెందిన వేములకొండ చరణ్‌గౌడ్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 విభాగంలో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రన్నింగ్, లాంగ్‌జంప్‌లో బంగారు పతాకాలు సాధించిన చరణ్ డీఈఓ సోమశేఖర శర్మ, డీవైఎస్‌ఓ నంబూరి సునీల్‌రెడ్డి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, ఎంఈఓ అబ్రహం, గ్రామస్తులు అభినందించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


ఏన్కూరు: మాట్లాడుతున్న హేమంతరావు

ఏన్కూరు/కారేపల్లి/కొణిజర్ల: ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతర పోరాటాలు చేస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా నాయకుడు దొండపాటి రమేష్ తెలిపారు. గురువారం మండలంలో నిర్వహించిన సీపీఐ మండల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. అదే విధంగా కారేపల్లి క్రాస్ రోడ్డులో పుచ్చకాయల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కారేపల్లి, కామేపల్లి మండలాల్లో, కొణిజర్ల దొండపాటి భవన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పదవులు ఉన్నా లేక పోయినా ప్రజల పక్షాన పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనలో ఏ వర్గం సంతోషంగా లేవన్నారు. ఈ నెల 26న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నాయకులు రంజిత్‌కుమార్, వీరభద్రం, సత్యం, వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు లతాదేవి, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణ, సుధాకర్, రమేష్, సోమయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో నమోదు చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న స్పెషలాఫీసర్

మధిర: ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే పూర్తి చేసి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని మధిర మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దెందుకూరు గ్రామంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆ వివరాలను ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో ఎటువంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని కోరారు. సర్వే ప్రక్రియలో భాగంగా ప్రతి 500 ఇళ్లకు ఒక సర్వే అధికారిని నియమించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువు లోగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి బండి నాగేంద్రబాబు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం తక్కెళ్లపాడు, జమలాపురం, ఎర్రుపాలెం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ. 2.09లక్షల విలువైన చెక్కులను పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో లబ్ధిదారులకు చెక్కులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు నర్సింహారావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, రామారావు తదితరులున్నారు.

న్యూలిటిల్ ఫ్లవర్స్ కాలేజీని సందర్శించిన ఎన్‌సీసీ కల్నల్


మాట్లాడుతున్న కల్నల్ భద్ర

వైరా: ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ పొందిన న్యూలిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలను ఎన్‌సీసీ 11(టి) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కే.భద్ర గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణ తీసుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశ భద్రత, జాతీయ భావం, సామాజిక సేవ వంటి లక్షణాలు అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ భూమేష్, డైరెక్టర్ సుమన్, ఎన్‌సీసీ సిబ్బంది సుబేదార్ మేజర్ బాల బహదూర్ పున్, సుబేదార్ రాజారామ్ పాటిల్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏఓ నరసింహారావు, ఎన్‌సీసీ ట్రైనర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


క్విజ్ పోటీల విజేతలతో ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని సెయింట్ విన్సెంట్ హైస్కూల్లో గురువారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యా భారతి, కార్తికేయ, అంగిరేకుల నాగపావని సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు


గీతా మందిరంలో భక్తులు

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలో గల శ్రీపార్థసారథి స్వామి ఆలయంలో గురువారం ధనుర్మాసం సందర్భంగా శ్రీవేంకటేశ్వరశరణాగతి దీక్షాదారులు, శ్రీకృష్ణదీక్ష భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ధనుర్మాస పాశురాన్ని అర్చకులు కృష్ణచైతన్య వివరించారు. కార్యక్రమంలో గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, కొత్తూరు రాజా, లీలా కృష్ణ, నరుకుళ్ల సత్యావతి పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం


నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

మధిర: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మధిర దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మధిర అంబేడ్కర్ సెంటర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జేఏసీ నాయకులు బొల్లెద్దు రాజేందర్, నీలం రమేష్, వేల్పుల శివ, గద్దల అనిల్, మణికంఠ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, విజయకుమార్, ప్రకాష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం..

కారేపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఉమ్మడి ఖమ్మం జిల్లా అంబేడ్కర్ సేన కన్వీనర్ పప్పుల నిర్మల అన్నారు. గురువారం కారేపల్లిలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలతో దళిత వ్యతిరేకిగా బీజేపీ మరోసారి ముద్ర వేసుకున్నదని తెలిపారు. అమిత్‌షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం


సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి

మధిర/సత్తుపల్లిటౌన్: ఈ నెల 20న సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ మధిర డిపో మేనేజర్ డి.శంకర్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సలహాలు, ఫిర్యాదులు ఇచ్చేందుకు 9959225961 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అదే విధంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఉదయం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు.. సమస్యలను తెలిపేందుకు 9959225962 నంబర్‌కు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు.

పశు వైద్య శిబిరం విజయవంతం



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

మధిర: సిరిపురం గ్రామంలో గురువారం శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో పశు వైద్యురాలు ఉమా కుమారి పాల్గొని 30 పశువులకు వైద్య సేవలు అందించారు. పశువులను పరీక్షించి రోగాలకు తగిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ/ఏన్కూరు/కల్లూరు: అన్నారుగూడెం 132కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా తల్లాడ, ఏన్కూరు, కల్లూరు మండలాల పరిధిలోని వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తల్లాడ ఏడీఈ ఎస్.సతీష్, ఏఈలు ఉమకాంత్, వెంకట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యవసాయానికి పై మూడు మండలాల పరిదిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

మహిళలకు ఆటల పోటీలు


ఆటల పోటీలకు హాజరైన మహిళలు

సత్తుపల్లిరూరల్: సింగరేణి దినోత్సవ వేడుకల సందర్భంగా సత్తుపల్లిలోని లేడీస్‌క్లబ్ మహిళలు, పీవీ నరసింహారావు సింగరేణి కాలనీలోని ఉద్యోగస్తుల గృహిణిలకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం ప్రగతివనంలో జరిగే దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందించబడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషాప్రహ్లాద్, చాముడేశ్వరి నరసింహారావు, విజయ, భాగ్యలక్ష్మి, దేవదాస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

చర్చి నిర్మాణానికి రూ.లక్ష వితరణ


నగదు అందజేస్తున్న దేవరపల్లి కుటుంబ సభ్యులు

కల్లూరు: మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి లింగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త దేవరపల్లి పట్టాభి దంపతులు, వారి తల్లిదండ్రులు దేవరపల్లి నాగప్రసాద్, మాజీ సర్పంచ్ అరుణలు గురువారం చర్చి కమిటీ సభ్యులకు రూ.లక్ష వితరణ చేశారు. ఈ సందర్భంగా చర్చి కమిటీ సభ్యులు దేవరపల్లి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేము కృష్ణ, నలజాల హరీష్, వేపూరి హరీష్, దేవరపల్లి కిషోర్, చావా సాయి, చెరుకూరి మోహనరావు, మద్దినేని సత్యనారాయణ, మట్టూరి శ్రీనివాస్, పాత ఎర్రబోయినపల్లి గ్రామస్తులు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు బియ్యం..


గౌసుద్దీన్‌ను సన్మానిస్తున్న మాలధారులు

కారేపల్లి: కారేపల్లి సాయి మందిరంలోని అయ్యప్ప మకరజ్యోతి దర్శన పీఠం అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానంలో భాగంగా బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్‌కే.గౌసుద్దీన్ రూ.10 వేలు విలువైన బియ్యాన్ని గురువారం వితరణగా అందించారు. అనంతరం ఆయన్ని అయ్యప్ప మాల ధారులు శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. గురుస్వాములు కేశగాని బాలకృష్ణ, గౌడుగు శ్రీను, కొమరయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, రాము, అనీల్, సద్దాం హుస్సేన్, ఫిరోజ్ పాల్గొన్నారు.

రూ.30వేలు ఆర్థిక సాయం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కాకర్లపల్లిరోడ్‌లో గల రావిచెట్టు బజారుకు చెందిన కనకం సునందరావుకు అనారోగ్యానికి గురికావటంతో కొంత మంది మిత్రులు రూ.30వేలు సేకరించి ఆయనకు అందించారు. కార్యక్రమంలో జగపతి, ప్రసాద్, సూరయ్య, బాలస్వామి, జగన్నాధం, పుల్లారావు, నవకుమార్, ఐవి శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

లింగాలకు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

కల్లూరురూరల్: మండలంలోని లింగాలలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు అయింది. ఇదివరకు పెద్దకోరుకొండిలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలోని 20 జీపీలకు విద్యుత్ సరఫరా చేయటం వలన తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తేవి. ఈ మేరకు ప్రజలు లింగాలలో సబ్‌స్టేషన్ నిర్మించాలని కోరడంతో.. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల సహకారంతో సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో లింగాల పంచాయతీతో పాటు కొత్త ఎర్రబోయినపల్లి, పాత ఎర్రబోయినపల్లి, చెన్నూరు, రావికంపాడు, యజ్ఞనారాయణపురం, ముచ్చవరం, పాయపూరు గ్రామ పంచాయతీలకు విద్యుత్ సరఫరా చేయనున్నారు. దీనికి గానూ.. అవసరమైన 18 కుంటల భూమిని లింగాల గ్రామానికి చెందిన గోపిశెట్టి శేషమ్మ, నర్సింహారావు భూపత్రాలను విద్యుత్‌శాఖ అధికారులకు అందజేశారు.

మాల మహానాడు నాయకుల అరెస్ట్


పోలీసుల అదుపులో మాల మహానాడు నాయకులు

మధిర: మాల మహానాడు ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మధిర నాయకులను గురువారం టౌన్ పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాల మహానాడు మధిర నియోజకవర్గ కన్వీనర్ నల్లపు శేఖర్, మధిర పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, రమేష్, శివ, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆటో వర్కర్లు

తల్లాడ: తెలంగాణా రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 22న హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి శీల ఆటో యూనియన్ ఖమ్మం జిల్లా నాయకులు ఎస్.కె.లాల్ మియా, ఎస్.రమేష్, అప్పారావు, కృష్ణారావు, పుల్లారావు, రామారావు, మురళీ, శ్రీను పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

సత్తుపల్లిరూరల్: ఈ నెల 22న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ మధ్యాహ్నా భోజన పథకం వర్కర్స్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో గురువారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు టి.రామారావు, మహాదేవ లక్ష్మి, రహీమున్నీసా, వెంకటలక్ష్మి, శ్రీలక్ష్మి, కృష్ణవేణి, వెంకమ్మ పాల్గొన్నారు.